# బతుకు బరువు

ఎదురుగా వున్న ఫ్లాట్స్ - ఎన్ని కుటుంబాలో - గోడమీద నుంచి చూస్తున్న రాజుకి గొప్ప కాలక్షేపం. ఆ ఫ్లాట్స్ కిందవున్న చిన్న గదిలో వుండే వాచమన్ రంగయ్య వాడి భార్య సీతాలు అంటే ఎందుకో రాజుకి చాలా అభిమానం.

రాజు భార్య రేవతి ఆఫీసునుంచి వచ్చేసరికి, టూర్నుంచి వచ్చిన రాజు చాలా కోపంగా కనిపించాడు. 'చంపిపారేస్తా' అన్నాడు అటుచూస్తూ.

రేవతి ఖంగారుపడుతూ, ఏమిటీ, ఏమైందీ, అంది. 'లేదు - ఇదొక్కటే మార్గం' - అన్నాడు సిగరెట్టు వెలిగించి. అప్పుడర్థమయింది రేవతికి రంగయ్యని మళ్ళీ ఆ మూడో ఫ్లాట్లో వుండేవాడు కొట్టాడు - ఈయన రక్తం ఉడికిపోతోంది!! -

'మనకెందుకండీ, ఆ ఫ్లాట్ వుండేవాళ్ళ గురించి, ఆ వాచ్మన్ని వాళ్ళు కొడితే మీకేం, తిడితే మీకేం' అంది కాఫీ కప్పు భర్తకందించి.

'రేవతీ, నీకర్థంకాదా, ఒక మనిషి ఒక మనిషి కొట్టడంలో నీకేమీ అధర్మం కనిపించటం లేదా - పైగా, నిస్సహాయుణ్ణి కొట్టడం - థూ' అన్నాడు రాజు. రంగయ్య ఆ ఫ్లాట్లో వాచ్మన్ అని పేరేకానీ, మొత్తం అక్కడున్న అందరికీ అతనే నౌకరు ఒకవిధంగా-

'ఒరేయ్ - తీసుకురా' అంటూ చేతులో డబ్బుపెడతాడొకాయన. రంగయ్య గబగబా వెళ్లి సిగరెట్టు పెట్టెలు తెచ్చి ఆయనచేతికిస్తాడు. అంతలోనే 'రంగయ్యా - ఆసందు చివరిదాకా వెళ్లి తములపాకులు తెచ్చిపెట్టు - ఇంట్లో పూజవుంది, మరిచిపోయా' అంటుంది ఓ ఇల్లాలు. రంగయ్య సందు చివరిదాకా వెళ్ళి, తెచ్చి యిస్తాడు.

'రంగయ్యా, ఓమాటు సీతాల్ని ఇటురమ్మను - పనిమనిషి రాలేదు- నాలుగు గిన్నెలు-తోమిపెట్టమను' -

'రంగయ్య - అటువెళ్ళే కూరలబండిని ఆపవా--!! ఇలా, ఇలా ఎన్నెన్నో!! విసుక్కోకుండా అందరికీ అన్నీ చేసిపెడతాడు రంగయ్య. రంగయ్య మంచివాడు అని ఒకరంటే, ఊరికే చేస్తున్నాడా, అంతోఇంతో ముట్టచెప్తున్నాంగా అంటారు ఇంకొకరు. ఇవన్నీ గమనిస్తున్న రాజుకి ఒళ్ళు భగభగమండిపోతుంది!! - వాడు మనిషేగా - ఎన్ని పనులు చేస్తాడూ అంటాడు రాజు.

మీకెందుకండీ, వాడికి లేని బాధ' అంటుంది రేవతి. ఈ విషయంలోనే రోజూ రేవతి, రాజర పోట్లాడుకుంటారు.

ఆరోజు రాత్రి పదిదాటింది. భార్యభర్తలు భోజనం చేస్తున్నారు. పెద్దగా ఏడుపు, ఏదో గొడవ పక్కఫ్లాటులోనుంచి -- రాజు గబుక్కున చేయి కడుక్కున్నాడు. గోడ దగ్గరకు వెళ్ళాడు.... కరెంటు పోయింది.... ఆ గొంతు, ఆ ఏడుపు రంగయ్యదే.... సీతాలు ఏదో చెప్తోంది - మూడో ఫ్లాట్‌లో అతను నోటికొచ్చినట్టు తిడుతున్నాడు...

క్షణాలో సద్దుమణిగిపోయింది. ఎవర్నెళ్ళి ఏమని అడుగుతాడూ!! నీకెందుకంటే ఏం చెప్పాలీ - పైగా, నీకేనా పెద్ద జాలి, అసలేమయిందో తెలుసా అని తనకాలర్ పట్టుకు కోట్లాటకు వస్తే - రాజు మనసు చాలా బాధపడిపోయింది.

'రేవతీ - నేనోకటి ఆలోచిస్తున్న' - అన్నాడు సీరియస్‌గా. 'రంగయ్యతో రేపు మాట్లాడుతా - ఏమయిందో కనుక్కుంటా - ఇంతకు ముందుకుడా రంగయ్య గేటు తీయటం ఆలస్యం చేసాడని బూటుకాలితో వాణ్ణి తన్నటం చూసా.... ఆ మధ్య డ్రింకుతాగి, ఆ మత్తులో సీతాలుతో నోటికొచ్చినట్టు మాట్లాడటం విన్నా- అయినా, ఏంచూసుకుని వాడికా అహం' అన్నాడు రాజు.

'బాగుంది - ఆ ఫ్లాట్సులో సగం ఆయనవేనట - డబ్బు, డబ్బుండీ అంది రేవతి.

రాజు మాట్లాడులేదు.....

డబ్బుంటే మంచిదే - అది సద్వినియోగమైతే మరీ మంచిది - కానీ బీదవాణ్ణి బాధపెడితే - రేవతీ, నేను సహించలేను - ఏంకాకపోతే రంగయ్య ఏడుస్తాడూ - రాజు చెవులలో ఆ ఏడుపు ఇంకా వినిపిస్తోంది.

'వాళ్ళకి అంతగొడవ వుండదు - అవన్నీ మామూలే' అంది రేవతి. రాజు ముఖం కోపంతో ఉబ్బిపోయింది. 'ఏమిటీ - వాళ్ళకి అవన్నీ మామూలేనా - అంటే గోప్పోళ్ళు కొట్టినా తిట్టినా ఏడ్వటం మామూలంటావా - న్వ్వేం మాట్లాడుతున్నావో తెలుసా...బీదవాడికి నువ్వు చెప్పేది ఇదా! - రాజు గదిలోంచి బయటికి వెళ్ళిపోయాడు.

విద్యార్థిదశలో రాజు విద్యార్థినాయకుడు.... అన్యాయాన్నెదిరించటం, బీదలకి న్యాయం చేయటం అనే సిద్ధాంతం పెట్టుకుని, చాలామందిచేత తన్నులు తిన్నాడు. స్నేహితులనుకున్న వాళ్ళంతా శత్రువులయిపోయారు... ఆఖరికి తల్లితండ్రికూడా రాజు పద్ధతిని ఆమోదించలేకపోయారు. న్యాయం కావాల్సిందే - కానీ నువ్వొక్కడివీ చేయగలవా - నీకు ఆవేశం ఎక్కువరా, నీకెందుకు. నీ బతుకు నువ్వు బతుకు అనేది తల్లి. ఇప్పుడు భార్యా అదే అంటోంది - రేపు కొడుకూ అదే అంటాడేమో!! ఈ వ్యవస్థలో రంగయ్యలాంటి వాళ్ళందరి బతుకులూ ఎప్పటికీ అంతేనా!! -

సాయంత్రం సిగరెట్టు కొనుక్కుందుకు రాజు బయటకి వెళుతుంటే, ఇస్త్రీ బట్టలు పట్టుకుని వస్తున్నాడు రంగయ్య. రంగయ్యని ఆపాడు రాజు.

ఏమయింద అన్నాడు...

"ఏముందయ్యా - ఆయన రాత్రివచ్చి కారుహారన్ కొట్టారండి -- అన్నం తింటున్నా. అయినా, లేచెళ్ళా....అంతలోనే ఆలస్యమయిపోయిందని, నీకు అంత పొగరా, అయ్యగారు రాగానే పరిగెత్తివచ్చి తలుపుతీయవా అంటూ బూటుకాలితో తన్నారండి..... చికెన్‌గున్యాతో నడవటమే కష్టంగా ఉందండి - ఆ దెబ్బకి తట్టుకోలేకపోయానండి" - అన్నాడు రంగయ్య.

'రంగయ్యా - ఇక్కడేకదా పోలీస్‌స్టేషన్ - నీ తరుపున నేనే కంప్లయింట్ ఇస్తా - రోజూ దెబ్బలెందుకుతినాలీ' అన్నాడు రాజు. ఆమాటవిని గజగజ వణికిపోయాడు రంగయ్య. 'అయ్యా - వద్దయ్యా, పెద్దోళ్ళతో పని - ఏదో సర్దుకుపోతానయ్యా' - పోలీసులు గొడవ వద్దు బాబు' అంటూ కుంటుకుంటూ నడిచి వెళ్ళిపోతుంటే, ఆపి 'రంగయ్యా - సరే, ఆ వాచ్‌మన్ ఉద్యోగం మానేయ్ - మరేదయినా చూసుకో - నేనిప్పిస్తా - 'నీకు మాత్రం అభిమానం వుండదా - నీ భార్యని నిన్ను రోజూ అలా నీచంగా చూస్తుంటే అక్కడే పడివుండటానికి' - రాజు మాటలు వింటున్నాడు రంగయ్య - బాబు చెప్తోన్నవన్నీ నిజమే - కానీ, - తలొంచుకు ఆలోచిస్తున్నాడు. ఈ నౌకరీవదిలేసి, మరోచోటికి పోతే - ఎక్కడైనా కష్టపడకుండా తిండి దొరకదు కదా! సీతతో మాట్లాడుతా, ఈ పెద్దయ్యాచేత, ఏదోవంకని తన్నులు తినలేను అనుకుంటూ, 'రాజుబాబుగారూ...రేపోస్తానయ్యా ఇంటికి - సీతాలుని తీసుకొస్తా - నాకు ఇక్కడనుంచి వెళ్ళిపోవాలనే వుందయ్యా ' అన్నాడు రంగయ్య.

రంగయ్య నడుస్తుంటే కారు ముందుకు దూసుకుపోయింది. రంగయ్యా గేటు దగ్గరకి రాగానే, నువ్వు ఎవరితోనూ మాట్లాడుకూడదని చెప్పానా -- మరి, నీ కష్టాలన్నీ చెప్పుకుంటున్నావా - వాడు వింటాడు గానీ, నీకు గొప్ప నౌకరీ పెట్టిస్తాడా - రంగయ్యా విను, నా ఊరునుంచి నిన్ను నేను తెచ్చి ఇక్కడ పెట్టా - నాకు కోపం వస్తే కొడుతా, తంతా, నా యిష్టం - ఇంకోసారి, రోడ్డుమీద నిలబడి ఎవడితోనైనా మాట్లాడినట్లు తెలిసిందో, కాళ్ళిరక్కొడతా - రంగయ్య తలొంచకు నిలబడ్డాడు - కారు లోపల వెళ్ళగానే గేటు వేసి, తన గదిలోకి వెళ్ళిపోయాడు. అబ్బ ఎంత రాక్షసుడో అనుకున్నాడు మనసులో రంగయ్య.

రంగయ్యకీ అనిపించింది రెక్కల కష్టం చేసుకుంటే ఎక్కడైనా బతకచ్చు కదా! - రాజుబాబు చెప్పి మాటలు బాగా మనసుకెక్కాయి భార్య సీతాలు చాపమీద పడుకుని నిద్రపోతుంది. గబగబా లేపాడు. ఎంతో ఉత్సాహంగా రాజు చెప్పిన విషయం చెప్పాడు. ఆ బాబు మరో నౌకరీ ఇప్పిస్తాడంటా, వెళ్ళిపోదాం' అన్నాడు ఈ దెబ్బలు తిట్లు వుండవుగా' - రంగయ్య భార్యకేసి చూశాడు.

బంగారంలాంటి నిద్రపాడు చేసావుగా.... పదుకో.... ఈయన వెళ్ళగొట్టే వరకూ ఇక్కడే - ఎక్కడయినా బీదోళ్ళ బతుకులు అంతే!! - అంది రంగయ్య ఉత్సాహమంతా నీరు కారిపోయింది... అయినా, సీతాలు ఆలోచనలు వేరు - ఇక్కడి నించి వెళ్ళిపోతే, తలదాంచుకుందుకు చోటెక్కడా, ఓ గది ఎవరిస్తారు - అద్దెలు పెట్టి గదిలో వుండగలరా - అయినా, అయ్యాకొట్టినపుడు దెబ్బలుతిని పడుండాల అంతే, ఈ కాస్త నీడపోతే మనమెట్లా బతుకుతాం!! నువ్వు ఇక్కడ జరిగినవన్నీ చెప్పావా ఆ రాజుబాబుతో' అంది 'ఆ చెప్పా - మనం చెప్పినా చెప్పకపోయినా తెలియదా, ఈ రాక్షసుని విషయం' అన్నాడు కోపంగా.

'ఉష్, నెమ్మదిగా - ఎవరైనా వింటే, మళ్ళీ అయ్యకి తెలుస్తే, ఈమాటు కాళ్ళిరకొడతాడయ్యా' - ఇలా అంటూ సీతాలు బోరున ఏడ్చింది... ఏడ్వకుండా వుండి రంగయ్యకి ధైర్యం చెప్పాలనే అనుకుంది. కానీ, దుఃఖం ఆగలేదు. ఇంకా ఇద్దరాడ పిల్లలకి పెళ్ళి చెయ్యాలి - ఎట్లా - ఇంకోచోట మాత్రం కష్టాలుండవా - తమ బతుకులే అంత' - మళ్ళీ చాపమీద ఒత్తిగిల్లింది సీతాలు. నిద్ర పట్టలేదు - రేపెళ్ళి రాజుబాబుతో తను మాట్లాడి, అన్నీ సర్దుబాటు చేస్తా - మళ్ళీ కొత్త నౌకరీ - నే చేయలేను!! -

తెలతెలవారుతోంది. రాజు రంగయ్య వస్తాడని ఎదురు చూస్తున్నాడు .... రాత్రే స్నేహితుడితో మాట్లాడాడు. ఔట్‌హౌస్‌లో వుండవచ్చని, తనింట్లోపని చేస్తే చాలని చెప్పాడు అది రంగయ్యకీ మంచిదే - ఈ ఫ్లాట్‌లో అందరికీ చాకరీ చెయ్యటం కన్నా!! -

ఇలా రాజు అనుకుంటుంటే, తలుపు తోసుకు సీతాలొచ్చింది.

అయ్యా, నా మొగుడేం చెప్పాడో, నువ్వేం అర్థం చేసుకున్నావో నాకు తెలియదు... ఆరోజు ఆ పెద్దాయన ఏమీ అనలేదు. తలుపు తీసాడు. కారోచ్చింది లోపలకి- ఆ తలుపు వేస్తుంటే, అది కాలికి తగిలింది - దాంతో పెద్ద దెబ్బ తగిలిపోయినట్టు ఏడ్చాడు - అంతే' అంది సీతాలు.

'ఏంది సీతాలూ - తలుపు ఆలస్యంగా తీసినందుకు బూటుకాలితో తన్నాడు. అసలే చికెన్‌గున్యా వున్నందుకు మరీ దెబ్బ తగిలి, ఏడ్చాడు రంగయ్య. ఆయన నిన్ను నోటికొచ్చిన బూతులు తిట్టాడు - సీతాలూ ఇవేవి నీచం కాదా' ఆశ్చర్యంగా అన్నాడు రాజు.

'నిజమంతే - అదేనయ్యా, ఈ రంగయ్యకీ మాయారోగం - ఇంతుంటే అంతది చేసి చెప్తాడు - ఆడి మాటలు నమ్మకండి - వీడే తాగి నన్ను కొడతాడు, తిడతాడు - అయ్యా మీరు ఆడి విషయం పట్టించుకోకండి, - ఆ అయ్య దేముడు - మాకు ఈ నౌకరీ బాగుంది. రంగయ్య వస్తే కాళ్ళిరకొట్టి పంపించండి" అంటూ విసవిసా సీతాలు వెళ్ళిపోతుంటే, కంటిరెప్పపాటు లేక అట్లా చూస్తూ ఉండిపోయాడు రాజు.

'సాంఘిక న్యాయం' - నోటికి చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు వింటున్న రేవతి, భర్త దగ్గరకొచ్చింది. 'ఆ పెద్దాయన వీళ్ళని నానాబాధలు పెట్టడం, తిట్టడం, కొట్టడం అన్నీ నిజమే - కానీ అవన్నీ నిజమేనంటే, ఆ పెద్దయన వీళ్ళని మరీ హింసిస్తాడు - కొడతాడు - అదండీ, పాపం దాని భయం- పైగా ఇద్దరాడ పిల్లలున్నారు - ఏ క్షణంలో ఏ బుద్ధి పుడుతుందో వాడికి - ఈ భయాలతో పాపం సీతాలు, తన భర్త అబద్ధం చెప్పాడంది. అంతే- లోకం పోకడ తెలియని రంగయ్య నిజమే చెప్పాడు మీరు వాళ్ళని అక్కడనుంచి కదిపి, మీరో చోట సుఖంగా వుండేట్లు చూస్తానన్నా వాళ్ళకి భయమే అంది.

రాజు రేవతి మాటలు విన్నాడు, పాపం, రంగయ్య అని నిట్టూర్చాడు.... బతుకు బరువు మోయటానికి ఆ బీదాళ్ళకి తన్నులు తిట్లూ, తప్పవేమో!! - బతుకు బరువు ముందు నిజాలు తలవంచాలేమో.

రాజుకి తన చిన్ననాటి రోజులు కళ్ళముందునిల్చాయి. తండ్రి గుమాస్తా... ఆఫీసరు గారింట్లో ఎన్నో పనులు చెప్పేవారు.... ఆఫీసరు గారి అబ్బాయిని సైకిలు మీద స్కూల్లోదింపాలి..... ఆఫీసరుగారి భార్యకి కూరలు తెచ్చియియ్యాలి.. ఆఫీసరుగారి కుక్కను హాస్పటల్‌కి తీసుకెళ్ళి ఇంజక్షన్ ఇప్పించాలి... అబ్బబ్బ!! -

ఓ రోజూ కోపమొచ్చింది రాజుకి ! నాన్న, నువ్వెందుకీ పనులన్నీ చెస్తావూ-- ఆఫీసులో 'గుమాస్తా పని చేసి, ఇంటికొచ్చేయ్' అన్నాడు చాలా బాధగా.

తండ్రి నవ్వి, 'నేను గుమస్తానీ, ఆయన ఆఫీసరు - అంతే' అన్నాడు సైకిలు తుడుచుకంటూ!!

అంటే, ఎప్పటికీ ఇంతేనా!! -

బతుకు భయంతో అన్నిటికీ తలవంచాల్సిందేనా!! - అవును!!

రేవతీ, - మనకెట్లాగూ పిల్లలు లేరు - ఆ ఆడపిల్లల్ని మనం మంచి స్కూల్లో చేర్పించి చదివించమనచ్చా!! మనమే ఆ ఖర్చు పెడతామనచ్చా - అదీ తప్పా, అదీ భయమా!! - రేవతి నిజంగానే భయపడింది - ఎందుకీ బంధం!! -అడుగుతాను సీతాలునిపిలిచి' అంది ఏదో పనిచేస్తూ!! ఎత్తు పల్లాలు లాగే బతుకులను సరిచేయనీయరు ఎవరూ దీర్ఘంగా నిట్టూర్చాడు రాజు.